క్లుప్తంగా

రోడ్డు పనులు పూర్తి చేయాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహాగౌసుద్దీన్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రీనగర్‌లో 60 అడుగుల రోడ్డులో జరుగుతున్న సెంటర్ మీడియాన్ పనులను బుధవారం కార్పొరేటర్ సబిహాగౌసుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను వేగవంతం చేయాలని ఏఈ రంజిత్‌ను ఆదేశించారు. పనుల జాప్యంపై ఆరా తీశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, జితేందర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: కురుస్తున్న వర్షాలకు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ జీహెచ్ఎంసీ సిబ్బందితో గుంతలు పడిన రోడ్లలో బుధవారం ప్యాచ్‌వర్క్ పనులను చేయించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఆల్విన్‌కాలనీ: దోమల నివారణ కోసం ఎంటమాలజీ సిబ్బంది యాంటి లార్వా ఆపరేషన్‌ను బుధవారం చేపట్టారు. ఎంటమాలజీ ఫీల్డ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ నర్సింహులు సిబ్బందితో కలిసి మహత్మా గాంధీనగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ నీటి నిల్వలు గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. ఇళ్లలో వృథాగా ఉండే తొట్లలో, టైర్లు, కొబ్బరి బోండాలు, నీటి డబ్బాలలో నీరు ఎక్కువ రోజు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమలు వృద్ధి చెంది, దోమ కాటుకు గురి కావాల్సి వస్తుందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలపై మూతలు ఏర్పాటు చేసుకోవాలని, వాడని నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని సూచించారు.

పార్కులో బోర్డు ఏర్పాటు



నిజాంపేట్ : కబ్జాదారుల కబంధహస్తాల నుండి బాచుపల్లి కౌసల్య కాలనీలోని వాటర్ ట్యాంక్, పార్క్‌ను కాపాడాలని ఆశాజ్యోతి ఉమెన్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ మల్యాల రమణి జూలై 16న నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కమిషనర్ సాబేర్ అలీ సానుకూలంగా స్పందించి బుధవారం పార్క్‌లో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలం కౌసల్య పార్క్ స్థలమని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పేరిట బోర్డును ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించరూ?

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటాల్సిందేనా?

- ఇబ్బందులు పడుతున్న పాదాచారులు
- గతంలో రోడ్డు దాటుతూ ఇద్దరు మృతి

ఇటు అటుగా ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు వాహనదాల రద్దీ నిరంతరం ఉంటుంది. ఇటు నుంచి అటు వైపు, అటు నుంచి ఇటు వైపు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటాల్సిందే. ఏ వైపు నుంచి వాహనాలు దూసుకోస్తాయే అర్థం కాదు. ఇక్కడ వాహనాల నియంత్రణ ఎవరికీ పట్టడం లేదు. దీనితో తరచుగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు అతివేగంగా వస్తుంటాయి. కాలి నడకన రోడ్డు దాటాలనుకునే వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఒక్క పరుగున వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అయా ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పాదాచారులు, ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



ఇంద్రానగర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న పాదాచారులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ వద్ద ముంబాయి జాతీయ రహదారిపై విరామంలేని ట్రాఫిక్ ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంద్రానగర్, శ్రీశ్రీనగర్, ఎన్‌టీఆర్ నగర్, ప్రశాంత్‌నగర్‌లలో నివసించే కార్మికులు, సిమెంట్ పని చేసేవాళ్లు, రోడ్డుకు ఇటువైపు నుంచి అటు వైపుకు దాటాలంటే భయపడాల్సి వస్తుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటాల్సిందే అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాపోతున్నారు. రోడ్డు దాటాలంటే గుంపులు, గుంపులుగా రోడ్డు దాటాల్సిందే. రోడ్డు దాటే క్రమంలో ఇంద్రానగర్‌కు చెందిన ఓ మహిళ తన మనవడితో కొద్ది రోజుల క్రితం ప్రాణాలు కోల్పోయింది. చిన్న చిన్న ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. సిగ్నల్స్ ఉన్నప్పటికీ వాహనదారులు రెడ్ సిగ్నల్స్ పట్టించుకోకుండా వస్తుంటారు. ఎప్పుడు ఏ వాహనం ఢీ కొడుతుందనే భయంతో రోడ్డు దాటాల్సి వస్తుందని ప్రజలు భయపడుతున్నారు. వెంటనే ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు. అదే విధంగా గౌతమ్‌నగర్, ఫిరోజ్‌గూడ, సత్తిరెడ్డి కాలనీ, పూల్‌బాగ్ కాలనీల ప్రజలు రోడ్డుకు అటువైపు ఉన్న గౌతమ్‌నగర్‌కు వెళ్లాలన్నా ఇటు వైపునకు రావాలన్నా ఫిరోజ్‌గూడ వద్ద రోడ్డు దాటాల్సి ఉంటుంది. వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. స్కూల్ పిల్లలు రోడ్డు దాటాలంటే భయం, భయంగా పెద్ద వాళ్ల సహాయంతో రోడ్డు దాటుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



ఇంద్రానగర్, శ్రీశ్రీనగర్, ఎన్‌టీఆర్ కాలనీల్లో ఎక్కువగా కార్మికులు, రోజువారి పనిచేసే వారు నివసిస్తుంటారు. ఇక్కడ నుంచి రోజు పనుల కోసం బయటకు వెళ్తుంటారు. రోడ్డు దాటాలంటే కష్టంగా ఉంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డు దాటాల్సి వస్తుంది. ప్రజల కోరిక మేరకు ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

– జి. కృష్ణ, ఇంద్రానగర్, సీపీఐ నాయకులు

రోడ్డు దాటాలంటే భయం



కష్ట జీవులు నివసించే ప్రాంతాలు ఇవి. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు రోజు పని కోసం బయటకు వెళ్లాలి. అందుకోసం రోడ్డు దాటాలంటే భయం వేస్తుంది. బతుకు పోరాటం. ప్రజల అవసరాలను గుర్తించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

– మనోహరి, శ్రీశ్రీనగర్

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

ఓల్డ్ బోయిన్‌పల్లి: బలంరాయిలో అక్క మహంకాళి, బీరప్ప దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు నాయకులకు సన్మానించారు. కార్యక్రమంలో కుంటన్న, కనకరాజుయాదవ్, ఐలేష్, బుర్రి యాదగిరి, రాజుగౌడ్, చందుయాదవ్, మల్లేష్, బీరప్ప, దయ్యాల రాజు, రాజయ్య, లింగం, సాయి, సంపత్, మహేష్, పోచయ్య, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, దండుగుల యాదగిరి

బర్త్ డేకు పిలిచి యువతిపై లైంగికదాడి!

యువకుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

బాలానగర్: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతిని పుట్టినరోజుకు రావాల్సిందిగా ఓ యువకుడు ఆహ్వానించాడు. దీంతో ఆమె అతడి ఇంటికి వెళ్లింది. అదే అవకాశంగా భావించిన అతడు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన బాలా నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహరాజు వివరాల ప్రకారం.. ఖాజాగూడలో నివసించే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి ఫతేనగర్ డివిజన్‌లోని శోభన కాలనీలో నివసించే సిద్దారెడ్డి (24) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. సుమారు నెల రోజుల పరిచయం తర్వాత ఈ నెల 30వ తేదీన తన పుట్టినరోజు ఉందని ఆ యువతిని ఇంటికి ఆహ్వానించాడు. అక్కడికి వెళ్లిన ఆమెకు బీరు తాగించాడు. ఆ తర్వాత మత్తులో ఉన్న ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దీని నుంచి తేరుకున్న సదరు యువతి 100కు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

వ్యాధుల నివారణకు కృషి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు

- జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

కూకట్‌పల్లి: సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులకు సూచించారు. కేపీహెచ్‌బీకాలనీలో బుధవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి పర్యటించారు. వ్యర్థాల తొలగింపు, దోమల నివారణ స్ప్రే(ఫాగింగ్, యాంటీ లార్వా), పార్కులు, కాలనీల్లో నీరునిలిచే ప్రదేశాల్లో పరిశుభ్రత చర్యలు, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన తదిర కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌ను ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు వర్షకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీల్లో, ఇళ్ల చుట్టు చెత్త వేయండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డ్రేపర్ ఫౌండర్స్ ప్రోగ్రామ్ ప్రారంభం

- తొలిసారిగా నగరంలో ఏర్పాటు
- దేశవ్యాప్తంగా 14 అత్యుత్తమ స్టార్టప్‌ల ఎంపిక

గచ్చిబౌలి: ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి ఒక మిలియన్ అంత్రప్రెన్యూర్స్‌ను రూపొందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్ డ్రేపర్ స్టార్టప్ హౌజ్ భారతదేశంలో తొలి డ్రేపర్ ఫౌండర్స్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గచ్చిబౌలిలోని డ్రేపర్ స్టార్టప్ హౌజ్ అతిథ్యం ఇస్తోంది. ఈ సందర్భంగా డ్రేపర్ స్టార్టప్ హౌజ్ హైదరాబాద్ డైరెక్టర్ చైతన్య మాట్లాడుతూ దేశంలో ప్రతిభగల వ్యవస్థాపకులు ఎందరో ఉన్నారని, వారికి సరైన సమయంలో సరైన మద్దతు, అంతర్జాతీయంగా వారి ఉనికిని చాటుకునే అవకాశం, పెట్టుబడిదారుల యాక్సెస్ తదితర అవకాశాలను డ్రేపర్ ఫౌండర్స్ కార్యక్రమం ద్వారా కల్పిస్తున్నామన్నారు. గురువారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు డెమో డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొన్న 14 స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను ఎంపికైన పెట్టుబడిదారులు, మెంటర్లు, ఎకోసిస్టమ్ లీడర్స్‌కు ప్రదర్శిస్తాయి. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఎంపికైన 14 స్టార్టప్‌లు, నిర్వాహకులు వీరే..

మెడ్‌స్కోర్-మన్నూరి వంశీకృష్ణ, రెక్సాయిడ్-బాసిల్ పాలోస్, సాలాహషాట్స్-ఆస్థా దర్బిక, ఫిన్‌స్టోన్ ఏఐ-రుషికేష్ చవాన్, కుమ్మా-గౌతమ్ పలని స్వామి, ఫిన్‌స్టాక్ నితిన్‌రెడ్డి, మైక్రోకాస్మోస్ క్రియేషన్- డాక్టర్ అభిషేక్ మణిత్రిపాఠి, న్యూరల్ క్రాఫ్ట్-నియాస్, బ్రిక్‌పే-శుభంషా, గ్లాల్స్- శుభం శర్మ, అల్గోజియా-సందీప్‌యామా, వీజ్-ఏఐ-సీసా, సయ్యద్ అండ్ టీమ్, లోహాస్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్- హర్షా, స్పార్క్స్-కార్తీక్ నాగపూరీ నిర్వహించే స్టార్టప్‌లను ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసి వారికి తగిన శిక్షణ ఇస్తున్నారు.

కూకట్‌పల్లిలోని ఫిజిక్స్‌వాలా ఆధ్వర్యంలో బుధవారం పీడబ్ల్యూఎన్ఎస్ఏటీ (ఫిజిక్స్ వాలా నేషనల్ స్కాలర్‌షిప్ అండ్ అడ్మిషన్ టెస్ట్-2025ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. కార్యక్రమం ఇండియా తయార్ హై అనే థీమ్‌తో ఎన్ఎస్ఏటీ-2025 పోస్టర్ ఆవిష్కరణతో ప్రారంభమైంది. ఫిజిక్స్ వాలా హైదరాబాద్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ పరవస్తు ఆనందరామన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫిజిక్స్ వాలా బిజినెస్ హెడ్ శ్రీనివాస్ పాలం, ఫిజిక్స్ వాలా విద్యాపీఠం జ్యోతి సన్నె, అసోసియేట్ బిజినెస్ హెడ్ మహ్మద్ తౌఫిక్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి



సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో ఆయా కాలనీల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధికారులకు సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ మహంకాళీ నగర్‌లో బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఇప్పటికే సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా కాలనీలో అంతర్గత రహదారుల్లో వర్షపు నీరు, మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా ముందస్తు ప్రణాళికతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. కాలనీలోని రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చని వనంలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మొక్కలు నాటి సంరక్షించాలి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి రాందేవ్‌రావు ఆసుపత్రిలో సనత్‌నగర్ లయన్స్ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో కదంబ మొక్కలను ఆసుపత్రి వైద్యులతో కలిసి క్లబ్ నిర్వాహకులు బుధవారం నాటారు. ఈ సందర్భంగా లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ.. కదంబ మొక్కలు అన్ని రకాల మొక్కల కంటే ఎక్కువగా ఆక్సిజన్ ఇస్తుందని, చల్లని నీడను అందిస్తుందని అన్నారు. ఔషధ గుణాలు కదంబ మొక్కలలో ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నాగేశ్వరరావు, రమణారెడ్డి, ఐస్‌క్రీం వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి చైర్మన్ కమలాకర్‌రావు, ఇన్‌చార్జి యోబు, సుజాత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న లయన్స్ ప్రతినిధులు

కేపీహెచ్‌బీలో ఎకరం స్థలం రూ.65.34 కోట్లు

- హౌజింగ్ బోర్డుకు భారీ ఆదాయం
- రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల ద్వారా రూ.26 కోట్లు



హౌజింగ్ బోర్డు భూముల వేలం ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో : కూకట్ పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ ఫ్లాట్లకు మరోసారి రికార్డు స్థాయి ధర పలికింది. ఈ వేలం ప్రక్రియ ద్వారా ఆన్‌లైన్‌లో బుధవారం హౌజింగ్ బోర్డు భూములను విక్రయించింది. కేపీహెచ్‌బీ బీ 4 ఫేజ్ లోని ప్లాట్ నెం 1కు చెందిన ఎకరం విస్తీర్ణంలోని కమర్షియల్ ఓపెన్ ల్యాండ్ రూ.65.34 కోట్లు పలికింది. ఆన్‌లైన్ ద్వారా వేలం పాట నిర్వహించినందున బిడ్డర్ల వివరాలు చివరి నిమిషం వరకు బిడ్డర్లు స్వేచ్ఛగా ధరను కోట్ చేసే అవకాశం లభించింది. దీంతో ఎకరం ధర రికార్డు స్థాయికి చేరింది. వేలం పాటకు మొత్తం 11 బిడ్లు దాఖలు కాగా.. నలుగురు బిడ్డర్లు వేలం పాటలో పాల్గొన్నారని హౌజింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా సంస్థ ఈ ఎకరా విస్తీర్ణం భూమిని రూ.65.34 కోట్లకు వేలం పాటలో కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల ద్వారా రూ 26 కోట్లు

బండ్లగూడ నాగోల్‌లోని రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను దరఖాస్తు దారులకు లాటరీ ద్వారా కేటాయించడం ద్వారా ప్రభుత్వానికి రూ. 26 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇక్కడి 159 ఫ్లాట్లకు దరఖాస్తులు ఆహ్వానించగా.. మొత్తం 131 ఫ్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: కురుస్తున్న వర్షాలకు అయా ప్రాంతాల్లో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని హస్మత్‌పేట మాలబస్తీలో పర్యటించారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించారు. వర్షాలకు మాలబస్తీలో పాత ఇళ్లు సగం కూలిపోయి ఉందని, మరింత కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల నుంచి నడుస్తున్న ప్రజలకు, స్కూల్ విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన స్పందించి జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడారు. సగం కూలిపోయిన ఇళ్లు రోడ్డుకు పక్కనే ఉంటడంతో రాకపోకలు సాగించే వారికి ప్రమాదం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, నాయకులు కనకరాజుయాదవ్, షాయిన్ షా, వెంకటేశ్, గౌస్, అస్లాం, అక్రం, షబ్బీర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



సగం కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న దండుగుల యాదగిరి, నాయకులు

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంపై దృష్టి సారిస్తోంది. భూ కబ్జాలపై ప్రజావాణితో సహా ఎమ్మెల్యేలు, పలువురి ఫిర్యాదులు అధికార యంత్రాంగానికి అందుతుండటంతో వాటిని కాపాడే బాధ్యత తహసీల్దార్‌దేనని పలు సమీక్షల్లో ఆదేశాలిచ్చిన కలెక్టర్ మనుచౌదరి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ,అసైన్డ్ భూములపై మండలాల వారీగా ఆరా తీస్తున్నారు.

– సాక్షి, మేడ్చల్ జిల్లా



కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను గ్రామ రెవెన్యూ అధికారులుగా పునః ప్రవేశం చేయించడం ద్వారా ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో భూముల పరిరక్షణకు పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే నిర్వహించి, సాంకేతికంగా కిహోల్ మార్కప్ లాంగ్వేజ్ (కేఎంఎల్) మ్యాప్, (గూగుల్)లో పొందుపరిచే చర్యలను జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్ఐ, డీటీ, తహసీల్దార్‌పైనే ఉందని పేర్కొంటున్న యంత్రాంగం గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీ, పెన్సింగ్ వంటి రక్షణ చర్యలపై దృష్టి సారిస్తోంది.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో..

జిల్లాలోని 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూశాఖ ఇందులో ఎన్ని.. భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.

◆ శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపల్లి మండలంలో 900 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్ భూములు ఎక్కువే...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2004కు ముందు 116 రెవెన్యూ గ్రామాలు, పలు ప్రాంతాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. ఈ అసైన్డ్ భూములన్నీ పంటసాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు.

◆ ఘట్‌కేసర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం నిర్ణయంతో రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేయగా.. ఇందులో చాలా మేరకు వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆసుపత్రులు వెలిశాయి.

కోర్టు కేసుల్లోనూ అధికమే...

మేడ్చల్ జిల్లాలో భూ సంబంధిత కోర్టు కేసులు 706 ఉండగా.. ఇందులో మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 349, కీసర డివిజన్‌లో 357 ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ కోర్టుల్లో ఉన్న కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సుప్రీంకోర్టులో 1 కేసు ఉండగా.. హైకోర్టులో 481, జిల్లా కోర్టులో 65, లోకాయుక్త కోర్టులో 57, ఎల్‌డీ కోర్టులో 63, సివిల్‌కోర్టులో 6 కేసులు కొనసాగుతున్నాయి. కోర్టు దిక్కారంలో 35 ఉన్నట్లు రెవెన్యూశాఖ రికార్డులు చెబుతున్నాయి.

వివాదంలో చిక్కిన భూములివే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూవివాదాలు అధికంగా ఉన్నాయి. రెవెన్యూశాఖ రికార్డుల ప్రకారం వివాదాస్పద భూములు 12,073.17 ఎకరాలు ఉన్నాయి. ఇందులో సివిల్‌కోర్టు పరిధిలో వివాదంలో ఉన్న భూములు 2,485 ఎకరాలు కాగా.. రెవెన్యూ కోర్టు పరిధిలో 904 ఎకరాలు, ఇతర వివాదాలతో పాటు ఎండోమెంట్, వక్ఫ్, ఫారెస్ట్, వ్యక్తిగత వివాదాల పరిధిలో 2,466 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ పేర్కొంటోంది. అసైన్డ్ భూముల కేటాయింపుల్లోని 1603 ఎకరాల భూములు కూడా వివాదాల్లో ఉన్నట్లు సమాచారం.

◆ జిల్లాలో 5,837 ఎకరాల వివాదాస్పద భూముల వివరాల లెక్క తేలగా.. మిగతా 6,236 ఎకరాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాలను రెవెన్యూశాఖ గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.